మొదటి గంట కొట్టారు. ఆరోజే ఆఫ్‌యర్లీ పరీక్షలు మొదలు. పిల్లలందరూ సీటింగ్ ఎరేంజిమెంట్ ప్రకారం రూమ్స్ కెళ్ళి కూర్చోవాలి. ఇన్విజిలేటర్లు వారికి కేటాయించిన గదులకు తెల్లకాగితాలు అటెండెన్స్ పత్రాలు వున్న సంచులను తీసుకెళ్ళారు.

ఆరోజుకు సంబంధించిన పరీక్షాపత్రాలను సీల్డు కవర్స్ నుంచి బయటకు తీసి రూమ్‌వారీ లెక్కపెట్టి వాటిని ఇన్విజిలేటర్లకు అందజేయడానికి బయలుదేరాను.

గదుల కెదురుగా పదవతరగతి, తొమ్మిదోతరగతి విద్యార్థులు పరీక్షలు రాయడానికి లోపలకికి వెళ్ళకుండా బయట ఎండలో నిలుచున్నారు.

అర్థరాత్రి టీవీలో ఏదైనా సమ్మెకు పిలుపు ఇచ్చారా? ఎందుకు వీళ్ళు మెరుపు సమ్మె చేస్తున్నారు?? ఈ చిన్న ఊర్లో ఇంత పకడ్బందీగా ఎవరు నిర్వహిస్తున్నారు??? అంతా అయోమయంగా వుంది. ఇంతవరకు ఎవుడూ ఇలాంటి సంఘటనలు ఆ స్కూల్లో జరిగి వుండక పోవడంతో ఈ హఠాత్పరిమాణానికి విస్తూపోయి ఉపాధ్యాయులందరూ గదుల ముందే నిలబడి చూస్తున్నారు.

ప్రశ్నాపత్రాలు పంపిణీ చేయాలా... వద్దా... అనే మీమాంసలో క్షణకాలం నేనుండి పోయాను. వెంటనే తేరుకుని టీచర్లకు పరీక్ష పత్రాలు ఇచ్చి తిరిగి వచ్చాను.

ఈ లోపుగా ఉపాధ్యాయులు బయటకు వచ్చి విద్యార్థులను తారాస్థాయిలో కోప్పడి గదుల్లోకెళ్ళమని ఆదేశించారు. వారు చెక్కిన శిల్పాలులా నోరు మెదపకుండా అలాగే నిలబడ్డారు. ఒక్క అంగుళం కూడా ఎవరు కదల్లేదు. వాళ్ళు సమ్మె ఎందుకు చేస్తున్నారో ఎవరికీ తెలియదు.

నేను ఆ పాఠశాలకు బదిలీ మీద వచ్చి నాలుగు నెలలు అయింది. ఈ కాలంలో జరిగిన సంఘటనల్ని గుర్తు తెచ్చుకుంటూ విద్యార్థుల నిరసనకు కారణమేదైనా దొరుకుతుందని వెదకసాగాను.

* * * * *

"కెమెల్ క్యాట్ వస్తుంది... కెమెల్ క్యాట్ వస్తుంది..." గుమ్మం దగ్గర వున్న కుర్రాడు అరిచాడు. క్లాసంతా ఒకటే గొడవ. ఆ షెడ్డు పక్కనుంచే స్టాఫ్ రూమ్‌కి వెళుతున్న నా చెవిని ఈ అల్లరంతా పడక పోవడానికి ఏమాత్రం అవకాశం లేదు.

ఉపాధ్యాయులకు పేరు పెట్టడం ఇంతకు ముందురోజుల్లో అయితే సర్వసాధారణం. రైల్వే స్టేషన్లో జీడిపప్పు కొన్నందుకు జీడిపప్పు అనో, ఇంట్లో చొక్కా ఉతుకుతుంటే చాకలోడో అనో, చెంబు గారు, దిలీప్‌కుమార్, కోడి, పకోడి ఇత్యాది పేర్లతో ముద్దుగా పిలుచుకునే వారు. టీవీలు, కేబుల్స్ పెరిగినతర్వాత విద్యార్థులు బిజీ అయిపోయి ఉపాధ్యాయులను పట్టించుకోవడం మానేశారు.

"ఈరోజుల్లో కూడా విద్యార్థుల బిజీ జీవితాన్ని ఛేదించుకుని పేరు పెట్టించుకున్న మాస్టారెవరయి వుంటారు? నాథీరీతోనే దెబ్బతీస్తున్న వీరుడెవరో?" తెలుసుకోవాలన్న కుతూహలం పెరిగింది. స్టాఫ్ రూం కిటికీలోంచి పరిశీలించడం మొదలు పెట్టాను. నేను ఆ స్కూలు కొచ్చి అప్పటికి వారం రోజులయింది.

లావుపాటి బాణాకార్రను ఆసరాగా చేసుకుని కుంటుకుంటూ ఒక మాస్టారు అల్లరి చేస్తున్న క్లాసులోకి వెళుతున్నారు. నీరుకావి రంగు పంచ, దానిపై లాల్చి, చెవులకు బంగారు పోగులు, నుదుట వీభూది రేఖల మధ్య పెద్ద బొట్టు. చూడడానికి తెలుగుమాస్టారి లాగానే వున్నారు. ఆయన క్లాసులోకి ప్రవేశించినా విద్యార్థుల స్థితిలో మార్పులేదు. అల్లరి వినబడుతూనే వుంది.

నా పరిశీలనలోనే ఆ తరగతి విద్యార్థులు బుద్ధిమంతులే. తెలుగు మాస్టారి క్లాసులో విపరీత ప్రవర్తనకు కారణం రాబట్టాలని మధ్యాహ్నం రెండవ పీరియడ్‌లో కొత్తపాఠం మొదలు పెట్టాను.

"నెంబర్ సెవెంటీ ఫైవ్ నాకేమి పేరు పెట్టావో చెబుతావా?" చివర్న కూర్చుని పక్క కుర్రాడితో ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్న చురుకైన కుర్రవాడిని ప్రశ్నించాను.

"మీకు పేరెందుకు పెడతార్ సార్ తప్పకదా?!" ముందు బెంచీల అమ్మాయిలు స్పందించారు. ప్రశ్న ఎవర్ని అడిగినా, వెంటనే జవాబు చెప్పడం ముందు బెంచీల అలవాటు.

"అయితే తెలుగుమాస్టారికే పేరు పెడతారన్నమాట. ఏమోయ్ మాట్లాడవు?" నిలబడి నేలచూపులు చూస్తున్న సెవెంటీ ఫైవ్‌ని కదిపాను. క్లాసంతా నిశ్శబ్దం అయిపోయింది. అతడేం చెబుతాడోనని అందరూ ఎదురు చూస్తున్నారు.

"ఆ తెలుగు మాస్టారు క్లాసులోకి వచ్చి కూర్చుంటారు. లేకపోతే నిద్రపోతారు సార్. అందుకే అందరూ ఆయన క్లాసులో గొడవ చేస్తారు" జవాబులో కొంటెదనమేదీ లేదు. నిజాయితీ అతని మొహంలో కనిపిస్తోంది.

"మాస్టార్ల గురించి అలా మాట్లాడకూడదు. తప్పకదా? కూర్చో..." అని పెద్దరికంతో అన్నానే గానీ, నా కంఠ స్వరంలో తీవ్రతలేదు. లాలింపే తప్ప. ఎలాగో క్లాసు పూర్తయింది.

స్టాఫ్‌రూంలో హోంవర్క్ పుస్తకాలు దిద్దడం అయిపోయిన నేను తలెత్తి అడిగాను. "ఈ సీనియర్ తెలుగు మాస్టారి పేరేమిటండి? ఆయన గురించి తెలుసుకోవలసిన విషయాలేమన్నా వున్నాయా?" కోనసీమలో నేరుగా జవాబొస్తుందని కాదు అడిగి చూద్దామని డిస్కార్డ్ చేశా.

"భలే వారండి. ఆయనపేరు కాలనాథ భట్ల సత్య సూర్య సుబ్రహ్మణ్య శర్మ, మన ప్రధానోపాధ్యాయుల వారికి దూరపు బంధువు. మనిషి చాలా మంచివారు కాకపోతే కొంచెం చాదస్తం" దూరపు బంధువవడంలోనే తిరకాసంతా పెట్టి మరీ సెలవిచ్చారు సోషల్ మాస్టారు.

ఇంటిపేరు నాకెందుకో కాలనాగ భట్లలా వినిపించింది. 'చాదస్తానికి రెస్టీలియా జాతేనా లేక అంతకంటే ముందు తరమా?' అని అడుగుదామనుకుని ప్రయోజన ముండదని తెలిసి విషయాలన్నీ వాయిదా వేశాను. సోనీ శర్మగారిని పరిశీలిద్దామనుకుంటే ఆయనెప్పుడూ స్టాఫ్‌రూమ్‌కి రాడు. మెయిన్ బ్లాక్ చివర మెట్ల క్రిందే కుర్చీవేసుకుని కూర్చుంటాడు.

వరండా రూమ్ నుంచి నేలడుతూ పాఠశాలను నియంత్రించే రైలు పట్టా ముక్క దానిపై పడ్డ దెబ్బలకు గంభీర ప్రకంపనాలు చేయడంతో ఎవరి క్లాసులకు వాళ్ళు వెళ్ళిపోయాము.

"రూపాయి సంభావన ఇస్తారంటే ఎంత దూరమైనా వెళ్ళే రకముండి ఈ శర్మగారు. హెడ్‌మాస్టారి చుట్టం కాబట్టి అవన్నీ స్కూల్ టైములోనే జరిగేవి" ఆరోజు సాయంత్రం మా స్కూలు ఉపాధ్యాయుడు నన్ను వడిబజారులో ఆపి పక్కకు తీసుకెళ్ళి రహస్యంగా చెప్పడం మొదలు పెట్టాడు. "ఒకసారి సంభావన ఇస్తున్నారని తెలిసి పక్క ఊరు వెళ్ళేరు. అక్కడినుంచి వస్తుంటే ట్రాక్టరు గుద్ది రోడ్డు పక్కన పడిపోయారు. స్పృహ వచ్చిన తర్వాత చూసుకుంటే కాలు విరిగింది. అంతే కాకుండా ఆయన వేసుకెళ్ళిన కొత్త ర్యాలీ సైకిల్ మాయం అయింది" అని శర్మగారి కుంటికాలి వెనక కథ నా చెవిలో ఊదాడు.

పబ్లిక్‌గా జరిగిన విషయాన్ని కూడా ఇంత రహస్యంగా చెప్పడానికి కారణం మా జడ్.పి ఉపాధ్యాయుల ఎస్.ఆర్.లు ప్రధానోపాధ్యాయుల చేతిలో వుండడమే. ఎవరికన్నా చిన్న అధికారం వుంటే వాళ్ళకు భయపడి పోవడం, వంగి వంగి దండాలు పెట్టడం ఉగ్గుపాలతో నేర్చుకుంటారు.

ఒకరోజు ప్రధానోపాధ్యాయులు కాన్ఫరెన్స్‌కు కాకినాడ వెళ్ళారు. ఆరోజు స్కూలుకు నేనే ఇన్‌ఛార్జిని అవ్వడంతో శర్మగారి ఆగడం మరొకటి నా చెవిన పడింది.

"వెధవ క్రాఫ్టు టీచరు ఉద్యోగం వచ్చి ఫస్ట్‌పీరియడ్లు లేకుండా పోయాయి. రోజూ ఈ శుద్ధి కార్యక్రమంతో చస్తున్నా. ఇంత ఆచారం ఉన్నవాళ్ళు ఉద్యోగాలు చేయ కూడదమ్మా..." హెడ్ మాస్టర్ లేరని తెలిసి అందరికీ వినపడేలా గొణిగారు క్రాఫ్ట్ టీచరు.

ఈ వారం కథ

"ఏమయిందండి?" అడగకపోతే బాగుండదని అడిగాను.

"నేనూ బ్రాహ్మణ పుటకే పుట్టా. అయితే మాత్రం ఇంత ఇదా... కాలనాథ భట్ల వారు లేరండీ?... అదే మన తెలుగు మాస్టారు. బడికి వచ్చేటపుడు పెన్ను తెచ్చుకోరు. పోని అడిగారు కదా అని ఇస్తే నీళ్ళు చల్లి శుద్ధి చేసి సంతకం పెట్టి ఆ టేబుల్ మీద పడేసి పోతారు. ఇదెక్కడైనా వుందా? మీరైనా చెప్పండి" అనర్గళంగా గుక్క తిప్పకోకుండా ఆమెకు జరుగుతున్న అవమానాన్ని ప్రకటించారు.

ఆమె మాటలు విని స్థాణువై పోయాను. రావులపాలెంలో పని చేస్తున్నపుడు. ఆస్కూలు ప్రధానోపాధ్యాయుని చర్యలకు ఇలాగే అవాక్కయి పోయాను. విద్యార్థులు బడిమాని సినిమాలకు వెళ్ళిపోతున్నారని, మార్నింగ్ షో, మ్యాటినీ, ఇంటర్వెల్స్ ముందు సినిమా ఆపించి గేట్లు తీయించి సినిమా హాలు చెక్ చేసేవాడాయన. మరలా ఇంత కాలానికి అంత ఆశ్చర్యానుభూతి కలిగించిన తెలుగుమాస్టారు ప్రవరాఖ్యుని అంశో లేక పురుష వాదో అయి వుంటాడని పించింది.



కెమెరా విజయకుమార్

ఆ అపర మనువు దెబ్బ ఒక భూభ్రమణం పూర్తి కాగానే నేను తింటానని అవ్వడనుకోలేదు.

రెండవ రోజు ఉదయం మొదటి పీరియడ్ అవుతుండగా ఎవరో పేరెంట్ వస్తే తరగతి గుమ్మం దిగి ఆయనతో మాట్లాడుతున్నా. ఇంతలో గంట కొట్టడంతో నెమ్మదిగా కుంటుకుంటూ తెలుగు మాస్టారు ఆ క్లాసులోకి నా ముందునుంచే వెళ్ళారు.

ఆయన రోజూ కాలువలోకి వెళ్ళి స్నానం చేసి, ఆ నీళ్ళలోనే బట్టలు జాడించుకుని అవి ఆరేంత వరకు వుండి వాటినే ధరించి వస్తారు. సబ్బును ఉపయోగించడం ఆయన దృష్టిలో పరమ నికృష్టమైన పని. ఆయన పరమ పవిత్రంగా భావించి ధరించే వస్త్రాలు చూపరులకు చాలా మురికిగా కనబడతాయి. ప్రస్తుత గోదావరిలో కించిత్ స్వచ్ఛమైన నీరు కూడా లేనందున శర్మగారి వస్త్రాలు కొద్దిగా దుర్గంధ భరితంగా వుంటాయని ప్రధానోపాధ్యాయుల అధిష్ఠానవర్గ నేతన శర్మల ఆరోపణ.

క్లాసుకు ఎదురుగా నిలబడి వుండడంతో శర్మగారు తరగతిలో ప్రవేశించగానే చేసే చర్యలు యథాలపంగా నా దృష్టిలో పడ్డాయి. ఆయన లాల్చీ జేబులో సర్వకాల సర్వావస్థల యందు గోదావరి జలం చిన్న సీసాలో వుంటుందని విన్నాను. ఇప్పుడా సీసాను తీసి అందులోని నీటితో నేను అంతకు మునుపు కూర్చున్న కుర్చీ మీద నీళ్ళు చల్లి శుద్ధి చేసిన తర్వాతే ఆయన అందులో కూర్చున్నారు.

అది చూడగానే నా గుండెలో ఎవరో చేయిపెట్టి కెలికినట్టయింది. మనస్సంతా అవమాన భారంతో నిండి పోయింది. జాషువా గారన్నట్టు గుండెల్లో ఒక్కసారి బాకుతో గ్రుమ్మినట్టయింది.

ఏవిషయంలోనూ రాజీ పడక ముక్కు గుద్దినట్టు ప్రశ్నించే తత్వముండకూడదు. అసలు కష్టాలు దాంతోనే ప్రారంభమవుతాయి. అంటే సంవత్సరానికొక బదిలీ, జిల్లా మ్యాపును కళ్ళు మూసుకుని గీచే నైపుణ్యం వచ్చేస్తాయి.

తెలుగు మాస్టారు వెళ్ళి కూర్చున్న క్లాసుకి లెక్కలు, సైన్స్ కూడా నేనే అవడంతో ఆరోజు టైమ్ టేబుల్ ప్రకారం తెలుగుతర్వాత మరలా నేనే వెళ్ళాలి. మూడు నెలలు తిరగకుండానే సమాయత్తమయ్యాను.

గంట కొట్టీ కొట్టగానే క్లాసులో ప్రవేశించాను. అప్పుడే తీరిగ్గా ఆవులిస్తూ టేబులును పట్టుకుని కుర్చీలోంచి పైకి లేచారు తెలుగుమాస్టారు. లీడర్ని పిలిచి అప్పటివరకు ఆయన కూర్చున్న కుర్చీని క్లాసు గుమ్మానికి ఎదురుగా బయట పెట్టించాను. నేను క్లాసులోకి ప్రవేశించగానే లేచి నిలబడిన విద్యార్థులు నేనేం చేస్తానో అని కళ్ళప్పగించి చూస్తున్నారు. క్లాసులో సూది పడితే వినపడేంత నిశ్శబ్దం.

నేను క్లాసులోంచి బయటకు వెళ్ళి కుర్చీ దగ్గర నిలబడ్డాను. అటెండర్ని పిలిచి బక్కెట్టుతో నీళ్ళు తెమ్మని పురమాయించాను. నేనేం చేస్తానో చూద్దామని తెలుగుమాస్టారు గుమ్మం బయటకు వచ్చి బాణం కర్ర ఆసరాతో నిలబడ్డారు.

అటెండరు నీళ్ళు తీసుకురావడానికి పట్టిన పది నిముషాల్లో అందరు ఉపాధ్యాయులు వరండాలోకి వచ్చి ఏం జరగబోతోందోనని చూడడం మొదలు పెట్టారు. విద్యార్థులందరూ గుమ్మాల దగ్గర కిటికీల దగ్గర గుమికూడారు.

'యు' ఆకారంలో నున్న గదుల కెదురు గుండా మధ్యలో ఖాళీ కుర్చీ, దాని కెదురుగా నేను, నడినెత్తిన సూర్యుడు మాత్రమే వున్నాం.

అటెండరు బక్కెట్‌తో నీళ్ళు తెచ్చి నా దగ్గర పెట్టి నేనేం చేస్తానో అని కుతూహలంతో చూస్తున్నాడు. చెంబుతో నీళ్ళు కుర్చీ మీద పోయడం మొదలు పెట్టాను. బకెట్‌లో చివరి చుక్కకూడా అయేంత వరకు అన్ని నీళ్ళు కుర్చీ మీద పోశాను. స్కూలంతా చిత్రకారుడు గీసిన బొమ్మలా నా చర్యలను చూస్తూ వుండి పోయింది. కుర్చీ మీద పడిన నీళ్ళ శబ్దం స్కూలంతా వినపడుతుంది.

"ఏం జరిగిందండీ? కుర్చీ ఎందుకు కడుగుతున్నారు?" ఈ తతంగం అంతా ప్రధానోపాధ్యాయుని గది కెదురు గుండా జరగడంతో ఆయన బయలుదేరి నా దగ్గరకు వచ్చి అడిగారు. ఆ కంఠంలో కోపమో, కంగారో అర్థం కాని జీర వుంది.

జవాబు చెప్పడానికి నిముషమాగి తలపైకెత్తాను. "ఈ స్కూల్లో ఎవరి ఆచారాలు వారు పాటించ వచ్చుగా? మురికి మనుషులు కూర్చున్న కుర్చీని కడుక్కుని కూర్చోవడం మా ఆచారం" అని కుర్చీ ఆరడానికి ఎండలో వుంచి క్లాసుకు బయలుదేరాను. నా మాటలు విన్న మా అటెండరు కళ్ళు ఒక్కసారిమెరిసాయి, ప్రశంసా పూర్వకంగా నావైపు చూశాడు.

ప్రధానోపాధ్యాయులకు అర్థమై వుంటుంది. తెగే వరకు లాగితే ఎవరికి నష్టమో అన్నవిషయం. మనసులోనే లాభనష్టాలు బేరీజు వేసుకుని అవకాశం ఎదురుచూస్తూ అక్కడినుంచి ఆయన రూమ్‌కి విసవిసా వెళ్ళిపోయాడు.

ఈ కార్యక్రమం ఇక్కడితో ఆగిపోతే హెడ్‌మాస్టారికి నాకు మెమో ఇచ్చే అవకాశం వచ్చేది కాదేమో.

* * * * *

"మీకు తెలుసు కదండి. దిద్దిన పేపర్లు మాకిచ్చి వాటిని తిరిగి తీసుకునేటపుడు వాటి మీద నీళ్ళు చల్లి కట్టకట్టుకుంటారు. ముట్టుకుంటేనే మైలపడి పోతుంటే అసలు ఆ పరీక్ష మేమెందుకు రాయాలి?" అదీ విద్యార్థుల నిరసనకు కారణం. బయట ఎండలో నిలబడిన విద్యార్థుల్లోంచి ఎస్.పి.ఎల్, మరి ఇద్దరు లీడర్లు వచ్చి హెడ్‌మాస్టార్కి నివేదించిన విషయం.

విద్యార్థులెప్పుడూ చురుకైనవారే. చదువులు పెరిగితే స్వార్థం పెరుగుతుంది. కులాల కంపు పెరుగుతుంది. వీళ్ళు సాదాసీదా హైస్కూలు విద్యార్థులేమో వీరి మనస్సులింకా విష పూరితంకాలేదు. ఒక్కరి కోసం అందరం అందరికోసం ఒక్కరూ అనుకునే అమాయక మనస్సులు వారివి.

విద్యార్థి నాయకుల మాటలు విని ప్రధానోపాధ్యాయుల పని కుడితిలో పడ్డట్టయింది. "అదేమిట్రా అలాగంటారు. తెలుగుమాస్టారి చాదస్తం అందరికీ తెలిసిందేగా! అంతెందుకు నేను అమలాపురం వెళ్ళి చెక్కుమార్చుకుని జీతం ఇస్తేనే, ఆయన ఆ రూపాయి కాగితాల మీద నీళ్ళు చల్లి శుద్ధి చేసి తీసుకుంటారు. నన్నెవరితో చెప్పకోమంటారు. ఇలాంటి చిన్నవిషయాలకు రభస చేయకూడదు. అయిందేదో అయింది. ఇకవెళ్ళి పరీక్షలు రాయండమ్మా" చాదస్తం పేరుతో ఇతరులను కించ పరిచే దరిద్ర లక్షణాన్ని వెనకేసుకొచ్చారు.

"తెలుగుమాస్టారు మా పేపర్ల మీద నీళ్ళు చల్లి శుద్ధి చేయడం మానేస్తానంటే మేము పరీక్ష రాస్తామండి" వచ్చిన ముగ్గురూ ఏకగ్రీవంగా వారొచ్చిన పనిని చెప్పేశారు. ప్రధానోపాధ్యాయుల ముందునిలబడి అంత ధైర్యంగా చెప్పడానికి వారికి ధైర్యాన్ని ప్రసారం చేసిన శక్తి బయట నిలబడి నిరసన తెలియజేస్తున్న విద్యార్థుల ఆత్మగౌరవానికి, ఆశక్తి తరంగ ధైర్యం ఎన్ని తలుపులు, గోడలనుంచైనా దూసుకొని వెళ్ళగలదు.

"దీని వెనక ఎవరి హస్తముందో నాకు తెలుసు. దానికి ఏంచేయాలో కూడా నాకు బాగా తెలుసు. రామనాథం. .. రామనాథం... ముంటిలా రావయ్యా. ఆ లెక్కల మాస్టార్కి మెమో తయారు చెయ్యి" హెడ్‌మాస్టార్ ఆవేశంతో ఊగిపోతూ గుమాస్తాను పిలిచి చెప్పారు.

ఆవేశంతో ఊగిపోతూ, నిన్న కాక మొన్న జిల్లాలో ఉత్తమ ప్రధానోపాధ్యాయుడు అవార్డు సంపాదించిరాయె. ఆయన సర్వీసు హోలు మొత్తం ఇలాంటి తిరుగుబాటు కనీవినీ ఎరుగరాయె.

ఉరిమి ఉరిమి మంగలం మీద పడ్డట్టయింది తంతు. మొత్తానికి నన్ను కేంద్ర బిందువుగా చేసే ప్రయత్నమది. ఈ సంఘటనకు నన్ను బాధ్యుడిని చేసి నా తిక్క కుదుర్చాలని ప్రధానోపాధ్యాయుల వ్యూహం. ఆవేశంలో ఆయన గురిపెట్టిన బాణంసంఘటనంతా రికార్డు చేసి ఎవరికి తగులుతుందో చూడడం లేదు.

ఈ సందర్భంలో మెమో తీసుకోవడం నాకు చాలా సంతోషంగా వుంది. "గదిలో అగ్గిపుల్ల గీస్తే గది వేడెక్కుతుందా? నీ పిచ్చి గాని నీ ఒక్కడివల్ల సమాజం మారదు. కాలాన్నిబట్టి నడుచుకుంటుంది అని అందరూ చెప్పేవారే. 'కాలిచే సాధనాలు వుండాలే గాని గదిలోఒక్క అగ్గిపుల్లకాదు, సగం అగ్గిపుల్ల మండినా గది ఉష్ణోగ్రత అంతకుముందుకంటే పెరుగుతుందనే భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిని.

చిందులు తొక్కుతున్న మా ప్రధానోపాధ్యాయుని దగ్గరకు ఆపూట సెలవు రాసి తీసికెళ్ళాను. "నాకు అర్జంటు పని వుంది. బయటకు వెళుతున్నాను. మధ్యాహ్నం వచ్చి మీరిచ్చే మెమో తీసుకుంటాను" అని సెలవు చీటీ టేబుల్‌పై పెట్టి తిరిగి చూడనైనా చూడకుండా బయటకు వచ్చేశాను.

బయట నిలబడి వున్న విద్యార్థులను చూశాను. వారు చేస్తున్న పోరాట కార్యక్రమం చిన్న విషయం కాదు. అది వారి జీవితాల్లో భావికాలంలో తీసుకువచ్చే మార్పును ఆలోచిస్తే నాకు చాలా ఆనందమేసింది. వారి ముఖాల మీద ఎండ వెలుగుకు ప్రకాశిస్తున్న చెమట బిందువులు చైతన్య స్రవంతికి నాందీ వాచకం లాగుతున్నాయి.

ఈ విద్యార్థులు గీచిన అగ్గిపుల్లల వేడి ఎవరూ కొలవకుండానే ఈ స్కూలు కాంపౌండ్ గోడల మధ్యనే ఆగి పోకూడదు. ఈ ప్రపంచంలో ఆ వేడిని కొలిచే సాధనాలకు ఈవిషయాన్ని అందజేయాలని స్కూటరు స్టాండు తీసి పత్రికా ప్రతినిధుల దగ్గరకు బయలుదేరాను.

[తమిళనాడులో అగ్రకులస్తుల గ్లాసుతో మంచినీళ్ళు త్రాగినందుకు కన్ను పోగొట్టుకున్న దళిత బాలిక సంఘటన సాక్షిగా ఈ దేశంలో డైనోసర్‌లు అంతరించలేదు].